క్లుప్తంగా

ఉస్మానియాలో రక్తదాన శిబిరం



రక్తదానం చేస్తున్న సంస్థ సభ్యులు

అఫ్జల్‌గంజ్: రక్తదానం చేయడం ప్రాణదానంతో చేయడంతో సమానమని ఉస్మానియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ బి. నాగేందర్ అన్నారు. ఆదివారం వీ లవ్ యూ ఫౌండేషన్ ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో ఫౌండేషన్ సభ్యులు దాదాపు 136 మంది రక్తదానం చేశారు. డాక్టర్ నాగేందర్ మాట్లాడుతూ.. ప్రపంచ 508వ రక్తదాన శిబిరాన్ని ఉస్మానియాలో ఏర్పాటు చేయటం అభినందనీయమన్నారు. సంస్థ ప్రతినిధులను అభినందించారు.

అన్నదానం



ఆస్పత్రి వద్ద అన్నదానం చేస్తున్న దృశ్యం

గోల్కొండ: నిరుపేదలకు కడుపు నిండా భోజనం పెట్టడం తనకు ఎంతో సంతృప్తినిస్తుందని టోలిచౌకి జానకీనగర్ కాలనీకి చెందిన ప్రముఖ సంఘ సేవకుడు సయ్యద్ మూసా అన్నారు. ఆయన ఆధ్వర్యంలో ఆదివారం మెహిదీపట్నం తదితర ప్రాంతాల్లోని ప్రభుత్వ ఆస్పత్రి వద్ద రోగులు, వారి సహాయకులకు భోజన ప్యాకెట్లు అందజేశారు. గోల్కొండ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మహ్మద్ బషీరుద్దీన్ ఆధ్వర్యంలో ప్రముఖ ప్రభుత్వ ఆస్పత్రుల వద్ద గత 341 రోజులుగా అన్నదానం నిర్వహిస్తున్నానని, ఇందులో తనతో పాటు తన స్నేహితులు కూడా పాల్గొని అన్నదానం చేస్తున్నామని ఆయన తెలిపారు.

'అదాని ఆస్తులపై విచారణ జరపాలి'

గన్‌ఫౌండ్రీ: అదాని, అంబానీల లాంటి పెట్టుబడిదారుల నాయకుడు ప్రధాన మంత్రి మోదీ అని ఆమ్‌ఆద్మీ పార్టీ రాష్ట్ర కోర్ కమిటీ సభ్యుడు దిండి సుధాకర్ ఆరోపించారు. అదాని కుంభకోణాలపై సుప్రీంకోర్టు పర్యవేక్షణతో విచారణ జరపాలని కోరుతూ ఆదివారం నాంపల్లిలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయాన్ని ముట్టడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మోదీ పాలన అవినీతిమయమని ధ్వజమెత్తారు. ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర కార్యాలయంలోకి ఆమ్ ఆద్మీ పార్టీ కార్యకర్తలు వెళ్లేందుకు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. దీంతో పోలీసులకు, ఆప్ నేతలకు మధ్య వాగ్వాదం జరగడంతో కొంత ఉద్రిక్తత చోటు చేసుకుంది. పోలీసులు ఆప్ నేతలను అరెస్టు చేసి వివిధ పోలీస్ స్టేషన్లకు తరలించారు.

మ్యాన్‌హోళ్లకు మరమ్మతులు



మరమ్మతు పనులను పర్యవేక్షిస్తున్న మహ్మద్ మూసా

విజయనగర్‌కాలనీ: ఆసిఫ్‌నగర్ డివిజన్‌లోని పలు బస్తీలు, కాలనీల్లో మ్యాన్‌హోళ్లు శిథిలావస్థకు చేరుకున్నాయి. అందులో మట్టి, ఇతర వ్యర్థాలు చేరుతుండడంతో తరచూ డ్రైనేజీలు పొంగిపొర్లుతున్నాయి. స్థానికుల ఫిర్యాదు మేరకు ఆదివారం సాబేదనగర్, అరబ్‌గల్లీ తదితర ప్రాంతాల్లో జల మండలి సిబ్బందితో కలిసి ఆసిఫ్‌నగర్ కార్పొరేటర్ మహ్మద్ మూసా మరమ్మతులు చేపట్టారు. ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలను ప్రాధాన్యత క్రమంలో పరిష్కరిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇమ్రాన్ లీడర్, అయ్యూబ్ భాయ్, జీహెచ్‌ఎంసీ డీఈ మహ్మద్ జమీర్ తదితరులు పాల్గొన్నారు.



నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో జరుగుతున్న నుమాయిష్ చివరి దశకు చేరుకుంది. దీంతో ఆదివారం ఎగ్జిబిషన్ గ్రౌండ్ సందర్శకులతో కిటకిటలాడింది. నగరం నుంచే కాకుండా వివిధ జిల్లాల నుంచి వచ్చిన సందర్శకులు వివిధ రకాల వస్తువులను కొనుగోలు చేస్తున్నారు.
- సాక్షి, సిటీ బ్యూరో

కఠోర హౌస్ దశమారేనా ?

- అధ్వానంగా మారిన హౌస్
- అభివృద్ధి చేయాలంటున్న ప్రజలు
- పట్టించుకోని అధికారులు



అధ్వానంగా మారిన గోల్కొండ కఠోర హౌస్

గోల్కొండ: గోల్కొండ కోటలోని కుతుబ్‌షాహీ రాజుల నివాసాలకు కఠోర హౌస్ నుంచి నీరు సరఫరా అయ్యేది. ఆ నీరు సుగంధ ద్రవ్యాలతో ఉండేదని చరిత్ర తెలుపుతుంది. దశాబ్దాల చరిత్ర గల ఈ కఠోర హౌస్ నేడు ఓ మురికి కుంటగా మారింది. అధికారుల నిర్లక్ష్యం, ప్రభుత్వాల ఉదాసీన వైఖరి కారణంగా ఎంతో సుదీర్ఘ చరిత్ర గల ఈ సుందర తటాకం నేడు డంపింగ్ యార్డుగా మారింది. ప్రభుత్వాలు మారుతున్నా కూడా కఠోర హౌస్‌గా పిలువడే ఈ కఠోర హౌస్ దశ మాత్రం మారడం లేదు.

హామీలకే పరిమితం..

- ప్రభుత్వాలు మారినప్పుడల్లా మంత్రులు, ఉన్నతాధికారులు ఈ తటాకాన్ని సందర్శించి కుప్పలు తెప్పలుగా హామీలు గుప్పిస్తున్నారు.
- అభివృద్ధికి నిధులు మాత్రం కేటాయించడం లేదు. ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా ఈ తటాకం నేడు ఓ వైపు మురికి కుంట, మరో వైపు డంపింగ్ యార్డుగా మారింది. అయితే బీఆర్‌ఎస్ ప్రభుత్వ హామీ తరువాత గోల్కొండ కోటలో పంద్రాగస్టు వేడుకలను సీఎం కేసీఆర్ ప్రారంభించారు.
- దీంతో కఠోర హౌస్ ప్రేమికులు, చరిత్రకారుల్లో ఆశలు చిగురించాయి. కఠోర హౌస్‌లో కూడా బీఆర్‌ఎస్ ప్రభుత్వం అభివృద్ధి పరుస్తుందని ఆశించారు.
- దీనిని అభివృద్ధి చేసి పర్యాటకులను ఆకర్షించేందుకు ఓటింగ్ కేంద్రంగా మార్చాలని కోరుతూ కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్ కఠోర హౌస్ వద్ద ధర్నా నిర్వహించారు.
- స్పందించిన మంత్రి కేటీఆర్ ఆధ్వర్యంలో మంత్రులు మహమూద్ అలీ, నగర మేయర్, బల్దియా ఉన్నతాధికారులు కఠోర హౌస్‌ను పరిశీలించి వెళ్లారు. తప్పకుండా చెరువును ఆధునీకరిస్తామంటూ హామీలు ఇచ్చి వెళ్లారు.



కఠోరహౌస్‌ను పరిశీలిస్తున్న మంత్రి కేటీఆర్, మహమూద్ అలీ తదితరులు (ఫైల్)

అసెంబ్లీ సమావేశాల్లో మరోసారి..

- ఇప్పటి వరకు ఇక్కడా నయాపైసా అభివృద్ధి పనులు కూడా జరగలేదు. అంతేకాకుండా రోజురోజుకూ కఠోర హౌస్ గుర్తుపట్టలేనంతగా మారిపోతున్నది.
- ప్రస్తుతం జరుగుతున్న అసెంబ్లీ సమావేశాల్లో ఈ కఠోర హౌస్ విషయంపై ప్రభుత్వాన్ని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్ మరోసారి నిలదీశారు. ఇప్పటికైనా కఠోర హౌస్‌ను అభివృద్ధి పరచాలని స్థానికులే కాకుండా పర్యాటకులు సైతం కోరుతున్నారు.

ఎన్ని పనులున్నా ప్రజా సేవలోనే: ఎమ్మెల్యే కౌసర్



సీఎంఆర్‌ఎఫ్ దరఖాస్తుపై సంతకం చేస్తున్న ఎమ్మెల్యే కౌసర్

గోల్కొండ: ఎన్ని పనులున్నా ప్రజా సేవలోనే ఉంటానని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్ అన్నారు. ఆదివారం ఉదయం ఆయన టోలిచౌకి మేరాజ్ కాలనీలోని తన కార్యాలయానికి వచ్చిన వారిని కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పలువురు తమ తమ దరఖాస్తులను ఆయనకు చూపించారు. దీనిపై ఎమ్మెల్యే దరఖాస్తులను చదివి సరైన వాటిపై సంతకాలు చేశారు. దరఖాస్తు చేసుకున్న వారు వారి పురోగతిపై ఎప్పటికప్పుడు తనకు సమాచారం అందించాలని ఆయన సూచించారు. అసెంబ్లీ సాక్షిగా కార్వాన్ నియోజకవర్గ సమస్యలపై ఆయా శాఖల మంత్రులను నిలదీస్తున్నానని ఆయన అన్నారు. కార్వాన్ డివిజన్‌లోనే కాకుండా నిరుపేదలు, పేద బడుగువర్గాల వారు, రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను తాను అసెంబ్లీలో ప్రస్తావించడం జరిగిందన్నారు. కార్వాన్‌లో డ్రైనేజీ పనులు, వరదనీటి పైప్‌లైన్ల పనులు జోరుగా సాగుతున్నాయని, ఆ పనులు పూర్తికాగానే రోడ్డు పనులు కూడా ప్రారంభిస్తామన్నారు. వచ్చే విద్యాసంవత్సరం నాటికి కార్వాన్‌లో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఉర్దూ, తెలుగు మాధ్యమాలు ప్రారంభమయ్యేలా కృషి చేస్తున్నానన్నారు.

ఆదిత్య ట్రస్ట్ ఆధ్వర్యంలో నిరంతరం సేవా కార్యక్రమాలు



వేడుకలో పాల్గొన్న నందకిశోర్ వ్యాస్ బిలాల్, ఉమాదేవి వ్యాస్ బిలాల్

అబిడ్స్: ఆదిత్య శ్రీకృష్ణ చారిటబుల్ ట్రస్ట్ తరపున నిరంతరం సామాజిక సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్లు ట్రస్ట్ చైర్మన్, రాష్ట్ర బీఆర్‌ఎస్ నాయకుడు నందకిశోర్ వ్యాస్ పేర్కొన్నారు. గోషామహల్‌తో పాటు రాష్ట్ర నలుమూలలా ఎన్నో సంవత్సరాలుగా సామాజిక సేవలు చేస్తున్న ఆదిత్య శ్రీకృష్ణ చారిటబుల్ ట్రస్ట్ జాతీయ స్థాయిలో కూడా సామాజిక సేవల్లో పాలుపంచుకుంటుందని వివరించారు. ఆదివారం గోషామహల్‌లోని ట్రస్ట్ కార్యాలయంలో విలేకర్లతో ఆయన మాట్లాడుతూ.. రాజస్థాన్‌లోని బిల్వారలో జరిగిన సామూహిక వివాహాలకు ఆదిత్య శ్రీకృష్ణ ట్రస్టు తరపున సహాయ సహకారాలు అందించినట్లు వివరించారు. బిల్వారలో 21 సామూహిక వివాహాలకు ఆదిత్య ట్రస్ట్ తరపున 80 శాతం ఆర్థిక సహాయం అందించినట్లు నందకిశోర్ వ్యాస్ బిలాల్ తెలిపారు. ఉమాదేవి వ్యాస్ బిలాల్ తదితరులు పాల్గొన్నారు.

అశ్రునయనాల నడుమ అంత్యక్రియలు



విద్యాధర్ అగర్వాల్ (ఫైల్)

చార్మినార్: ఘాన్సీబజార్‌కు చెందిన మాజీ కార్పొరేటర్ విద్యాధర్ అగర్వాల్ అనారోగ్యంతో శనివారం రాత్రి మృతి చెందారు. ఆయన అంత్యక్రియలు ఆదివారం ఉదయం పురానాపూల్ హిందూ శ్మశాన వాటికలో ముగిశాయి. అప్పటి గుల్జార్‌హౌస్ డివిజన్ టీడీపీ కార్పొరేటర్‌గా కొనసాగిన ఆయన తండ్రి స్వర్గీయ మనోహర్‌లాల్ అగర్వాల్ కూడా మాజీ కార్పొరేటర్‌గా పని చేశారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె సంతానం ఉన్నారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ నగరంలోని ఏఎస్‌జీ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో శనివారం రాత్రి మృతి చెందాడు. ఆదివారం జరిగిన అంత్యక్రియల్లో మాజీ ఎమ్మెల్యే ప్రేమ్ సింగ్ రాథోడ్, మాజీ కార్పొరేటర్లు రాంనారాయణ్ యాదవ్, మహ్మద్‌గౌస్‌తో పాటు వివిధ పార్టీలకు చెందిన నాయకులు భజరంగ్ శర్మ, సుంకరి రవీందర్, గోపి యాదవ్, వెంకట్రాములు గౌడ్, నవల్ కిశోర్ అగర్వాల్ పాల్గొని ఆయన కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.



అబ్బురపరిచిన విద్యార్థుల ప్రదర్శన

ఆకట్టుకున్న 'చేజ్ టు విన్'

గోల్కొండ: విద్యార్థులకు చదువు, క్రీడలతో పాటు దేశభక్తిపై కూడా పాఠాలు బోధిస్తుండాలని షేక్‌పేట్ కార్పొరేటర్ మహ్మద్ రాషెద్ ఫరాజుద్దీన్ అన్నారు. ఆదివారం షేక్‌పేట్ వీనస్ హైస్కూల్‌లో జరిగిన చేజ్ టూ విన్ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మూడు దశాబ్దాలుగా విద్యా రంగంలో ఉంటూ ఎందరో విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు కల్పించిన వీనస్ విద్యా సంస్థల డైరెక్టర్ హిదాయత్ అలీఖాన్‌ను ఆయన అభినందించారు. మెహిదీపట్నం, షేక్‌పేట్ తదితర ప్రాంతాల్లో విద్యనభ్యసించడమే కాకుండా శిక్షణ పొందిన సైనా నెహ్వాల్, పీవీ సింధూ, నిఖత్ జరీన్ లాంటి వారు భారతదేశ కీర్తి ప్రతిష్టతలను దేశవ్యాప్తం చేశారని ఆయన అన్నారు. మహ్మద్ హిదాయత్ అలీఖాన్ మాట్లాడుతూ.. తమ పాఠశాలలో చదువుకున్న ఎందరో అమ్మాయిలు నేడు మల్టీ నేషనల్ కంపెనీలతో పాటు దేశీయంగా పేరున్న కంపెనీలలో ఉద్యోగాలు చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఎంటీఆర్, ఎస్‌ఎంకే అధ్యక్షుడు అల్తాఫ్ హుస్సేన్, ఐటా నగర అధ్యక్షుడు మహమూద అలీ సోహెల్, డీలక్స్, బృందావన్ కాలనీ, ఫాతిమానగర్ కాలనీ అధ్యక్షుడు కె.క్యూ, జునైద్, గయాసుద్దీన్, సయ్యద్ జియావుద్దీన్ తదితరులున్నారు.

దళితుల సంక్షేమానికి పెద్దపీట



శాంతినగర్‌లో బసయాత్ర నిర్వహించిన బీఆర్‌ఎస్ నాయకుడు గడ్డం శ్రీనివాస్ యాదవ్

అబిడ్స్: దళితుల కోసం పలు సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి దళితుల జీవితాల్లో సీఎం కేసీఆర్ వెలుగులు నింపుతున్నారని గడ్డం గంగాధర్ యాదవ్ ఫౌండేషన్ చైర్మన్, రాష్ట్ర బీఆర్‌ఎస్ నాయకుడు గడ్డం శ్రీనివాస్ యాదవ్ పేర్కొన్నారు. జాంబాగ్ శాంతినగర్‌లో దళితవాడలో బసయాత్ర నిర్వహించారు. గడ్డం శ్రీనివాస్‌యాదవ్ మాట్లాడుతూ.. దళితబంధు పథకం దేశంలోని పలు రాష్ట్రాలు ఆదర్శంగా తీసుకుంటున్నాయన్నారు. దళితుల సంక్షేమానికి కేసీఆర్ ప్రభుత్వం పెద్దపీట వేసిందన్నారు. గోషామహల్ నియోజకవర్గంలో దళితవాడ బసయాత్ర కార్యక్రమాలకు విశేష స్పందన లభిస్తుందన్నారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

చార్మినార్: విద్యుత్ మరమ్మతుల కారణంగా సోమవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని చార్మినార్ సీబీడీ ఏడీఈ ఓ ప్రకటనలో తెలిపారు. రూప్ లాల్‌బజార్, ఘాజి బండ విద్యుత్ ఫీడర్ల పరిధిలోని పలు ప్రాంతాల్లో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సరఫరా ఉండదన్నారు. జీఎం చావునీ ఫీడర్ పరిధిలోని పలు ప్రాంతాల్లో మధ్యాహ్నం 12 నుంచి 2 గంటల వరకు. నీలం సెంటర్ ఫీడర్ పరిధిలోని పలు ప్రాంతాల్లో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు.

ఆస్మాన్‌ఘడ్ సీబీడీ ఏడీఈ పరిధిలో..

విద్యుత్ మరమ్మతుల కారణంగా సోమవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఆస్మాన్‌ఘడ్ సీబీడీ ఏడీఈ ఓ ప్రకటనలో తెలిపారు. రెయిన్‌బజార్, మూన్‌స్టార్, నెహ్రూనగర్, హబీబ్‌నగర్, రాజ నర్సింహనగర్, జమాల్ కాలనీ పరిధిలోని పలు ప్రాంతాల్లో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు.

గండి హనుమాన్ ఫీడర్ పరిధిలో..

అఫ్జల్‌గంజ్: 11 కేవీ గండి హనుమాన్, జాలి హనుమాన్, రహీంపురా విద్యుత్ ఫీడర్ల పరిధిలోని పలు ప్రాంతాల్లో సోమవారం విద్యుత్ సరఫరా ఉండదని అధికారులు ఓ ప్రకటనలో తెలిపారు. గాంధీభవన్, గంగాబౌలీ, మహబూబ్ కాలనీ, ఐస్ ఫ్యాక్టరీ, బల్‌రామ్ గల్లీ, జాలి హనుమాన్ పోలీస్ క్వార్టర్స్, హెచ్‌పీ పెట్రోల్ పంప్, మహంకాళీ ఆలయం, జుంగర్‌బస్తీ, ముఖేష్ పీటీ, రహీంపురా గ్రౌండ్, లారీ అడ్డా, ఖాగజీగూడా అవుట్ పోస్ట్, సీబీఐ క్వార్టర్స్, కవేశీ మజీద్, సంజయ్ నగర్, పురాణాపూల్ పోస్ట్ ఆఫీస్ తదితర ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. అలాగే 11 కేవీ అంబేడ్కర్‌నగర్, మహాలక్ష్మీనగర్ విద్యుత్ ఫీడర్ల పరిధిలోని న్యూ అంబేడ్కర్‌నగర్, బాల్‌రెడ్డి పీటీ, మైలమెట్, యుసుఫ్‌నగర్, శివ్‌లాల్ నగర్, కుమ్మర్‌వాడి, మార్వాడి బస్తి తదితర ప్రాంతాల్లో మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు విద్యుత్ నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డికి ఆహ్వానం



ఆహ్వాన పత్రికను అందజేస్తున్న మోహన్‌గౌడ్, రాజ్‌కుమార్ ముదిరాజ్, సచిన్‌రాజ్ తదితరులు

జియాగూడ: 18న కాగజ్‌గూడ శంకర్‌జీ, హనుమాన్‌జీ ఆలయంలో జరిగే శ్రీ శివ మహాజాగరణ ఉత్సవానికి హాజరుకావాలని దేవాదాయశాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డిని ఆహ్వానించినట్లు మహా జాగరణ్ సేవా సమితి ప్రధాన కార్యదర్శి మోహన్‌గౌడ్, కన్వీనర్ రాజ్‌కుమార్, కో కన్వీనర్‌లు సచిన్ రాజ్ సింగ్, జనగం పాండు తెలిపారు. ఈ మేరకు ఆదివారం మంత్రి కార్యాలయానికి వెళ్లి ఆహ్వాన పత్రికను అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. నగరంలోనే మహా శివ జాగరణ్ ఈ ఆలయంలో భారీ ఎత్తున నిర్వహిస్తున్నామన్నారు.

జన్మదిన శుభాకాంక్షలు



చాంద్రాయణగుట్ట: టీఎస్‌ఐఐసీ చైర్మన్ గ్యాదరీ బాలమల్లు పుట్టినరోజును పురస్కరించుకొని బీఆర్‌ఎస్ ఉప్పుగూడ డివిజన్ అధ్యక్షుడు ఆకుల శ్రీనివాస్ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ మేరకు పార్టీ నాయకులతో కలిసి ఆయనకు పూలబొకే, దేవుడి చిత్రపటాన్ని అందజేశారు.

సత్కారం



అంతర్జాతీయ రాయబారి డాక్టర్ ఐజాజ్ మొహ్మద్ ఉజ్జామన్‌ను సత్కరిస్తున్న దృశ్యం

అబిడ్స్: అంతర్జాతీయ శాంతి రాయబారిగా నియమితులైన డాక్టర్ ఐజాజ్ ఉజ్జామాన్ పలు దేశాలు చుట్టివచ్చి భారత్‌కు తిరిగి రావడంతో ఆయనకు ఘన స్వాగతం పలికినట్లు మానవ హక్కుల అభివృద్ధి సంక్షేమ సంఘం అధ్యక్షుడు మొహ్మద్ మసూద్ అలీ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటైన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఉజ్జామాన్ పేద, బడుగు, అట్టడుగువర్గాల ప్రజలను కరోనా విపత్తులో ఆదుకున్నారని తెలిపారు. సాజిద్‌బిన్ అబ్దుల్ హాజీజ్, మొహమ్మద్ ఆరిఫుద్దీన్, రహమత్ నవాజ్ బేగ్ పాల్గొన్నారు.

'ఫిబ్రవరి 14ను భావ వ్యక్తీకరణ దినోత్సవంగా ప్రకటించాలి'

సుల్తాన్‌బజార్: ఫిబ్రవరి 14 వాలంటైన్స్ డే- ప్రేమికుల రోజును భావ వ్యక్తీకరణ రోజుగా ప్రకటించాలని క్రైస్తవ ధర్మ ప్రచార పరిరక్షణ సమితి అధ్యక్షుడు జెరుసలేం మత్తయ్య డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆదివారం హైదర్‌గూడలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కొన్ని హిందూ సంస్థలు బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్, వీహెచ్‌పీ బజరంగ్‌దళ్ వంటి హిందూ మతవాద సంస్థలు ప్రేమికుల దినోత్సవం రోజున యువతీ యువకులను ఇళ్లలో నుంచి బయటకు రావద్దని హెచ్చరిస్తున్నాయని, ఇది భావ వ్యక్తీకరణ స్వేచ్ఛకు భంగమన్నారు. ప్రేమికుల దినోత్సవాన్ని అడ్డుకునే వారిపై చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

బ్రోచర్ ఆవిష్కరణ



బ్రోచర్‌ను విడుదల చేసిన అధ్యక్షుడు శంకర్, ప్రధాన కార్యదర్శి చంద్రకాంత్, వివేక్‌సింగ్

జియాగూడ: ఈనెల 19న ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతిని పురస్కరించుకుని భారీ శోభాయాత్రను నిర్వహిస్తున్నట్లు శోభాయాత్ర అధ్యక్షుడు జి.శంకర్, ప్రధాన కార్యదర్శి జి.చంద్రకాంత్, కోశాధికారి ఠాకూర్ వివేక్‌సింగ్ అన్నారు. ఈ మేరకు ఆదివారం జియాగూడ కేసరి హనుమాన ఆలయ ప్రాంగణంలో ఛత్రపతి శివాజీ మహరాజ్ సేవాదళ్ మహా శోభాయాత్ర బ్రోచర్‌ను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు ఎం.అనిల్, సుదర్శన్ ముదిరాజ్, గుర్రం శివశంకర్, డివిజన్ బీజేపీ అధ్యక్షులు లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

చార్మినార్ కళకళ.. గోల్కొండ కిటకిట

- కిక్కిరిసిన పర్యాటక ప్రాంతాలు
- సందడిగా మారిన కూడళ్లు, రోడ్లు



చార్మినార్ వద్ద సందర్శకుల సందడి

చార్మినార్: పాతబస్తీలోని పర్యాటక ప్రాంతాలన్నీ ఆదివారం సందర్శకులతో కళకళలాడాయి. ఉదయం నుంచి రాత్రి వరకు పర్యాటకుల సందడి తగ్గలేదు. చార్మినార్, లాడ్‌బజార్, మక్కా మసీదు, గుల్జార్‌హౌస్, మదీనా, పత్తర్‌గట్టి తదితర ప్రాంతాల్లో వినియోగదారుల సందడి పెరగడంతో చిరు వ్యాపారాలతో పాటు పెద్ద పెద్ద షోరూమ్‌లలో జోరుగా వ్యాపారం కొనసాగింది. సందర్శకుల రద్దీ పెరగడంతో వాహనదారులకు ట్రాఫిక్ సమస్యలు తప్పలేదు. అలాగే సాలార్‌జంగ్ మ్యూజియం, చౌమహల్లా ప్యాలెస్, హెచ్ఈహెచ్ నిజాం మ్యూజియం, జూపార్కు తదితర పర్యాటక ప్రాంతాలన్నీ పర్యాటకులతో కిటకిటలాడాయి.

జాతరను తలపించేలా..

గోల్కొండ: గోల్కొండ కోట జాతరను తలపించింది. సెలవు రోజులు కావడంతో భారీ సంఖ్యలో పర్యాటకులు గోల్కొండ కోటకు వచ్చారు. కోటలో నగీనా బాగ్, క్లాపింగ్ పోర్టికో, రాణీమహల్ ప్రాంగణం తదితర ప్రాంతాల్లో ఇసుకవేస్తే రాలనంత జనం ఉన్నారు. కాగా ఇతర రాష్ట్రాల నుంచి పర్యాటకులు నగీనాబాగ్‌లోని అక్కన్న-మాదన్న కార్యాలయాన్ని ఎంతో ఆశ్చర్యంగా తిలకించారు. అదే విధంగా అక్కన్న-మాదన్న కార్యాలయంతో పాటు నేటికి చెక్కుచెదరకుండా పటిష్టంగా ఉన్న రాణీమహల్ గదులు, గదుల నిర్మాణాన్ని విదేశీ పర్యాటకులు ఎంతో ఆసక్తిగా చూసి వాటిని ఫొటోలు తీసుకున్నారు. కోటలో కుతుబ్‌షాహీ రాజులు నిర్మించిన పెద్దబావి, దాని నిర్మాణ శైలి ఎంతో అద్భుతమని సదరు పర్యటకులు అన్నారు.



గోల్కొండ కోటలో పర్యాటకుల సందడి

గోవుల సంరక్షణకు ప్రత్యేక కృషి



శ్యామ్‌సుందర్‌ను సత్కరిస్తున్న కోటి శ్రీధర్, పురుషోత్తమ్ గుప్తా తదితరులు

అబిడ్స్: గోవుల సంరక్షణకు ప్రత్యేక కృషి చేస్తానని గో రక్షాదళ్ తెలంగాణ లీగల్ సెల్ అధ్యక్షుడు న్యాయవాది శ్యామ్‌సుందర్ పేర్కొన్నారు. నూతనంగా నియమితులైన సందర్భంగా ఆయనను ఘనంగా సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా శ్యామ్‌సుందర్ మాట్లాడుతూ.. గోవుల సంరక్షణకు, గో ఉత్పత్తికి నిరంతరం పాటుపడుతానన్నారు. గోవులను రక్షించేందుకు గో రక్షాదళ్ తెలంగాణ పలు అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో టీటీడీ తెలంగాణ గో రక్షాదళ్ సభ్యులు కోఠి శ్రీధర్, వీహెచ్‌పీ తెలంగాణ రాష్ట్ర లీగల్‌సెల్ కన్వీనర్ శివప్రసాద్, ఇతర నాయకులు రఘురామ్ శర్మ, అభయనాథ్ స్వామి, గిరిప్రసాద్, ఓంసింగ్ రాజ్ పురోహిత్, శ్రీరామ్‌జోషి, పవన్‌రెడ్డి, న్యాయవాది శ్రీదేవి, వినోద్‌కుమార్, ప్రసన్న, జస్వంత్ తదితరులు పాల్గొన్నారు.

'వాలంటైన్స్ డేను నిషేధిస్తున్నాం'



గ్రీటింగ్ కార్డ్సులను దహనం చేస్తున్న నాయకులు

సుల్తాన్‌బజార్: ప్రాశ్చాత్య సాంస్కృతి అయిన ఫిబ్రవరి 14న వాలంటైన్స్ డేను నిషేధిస్తూ ఆరోజు అమరుల సైనికుల దినోత్సవం జరుపుకోవాలని బజరంగ్‌దళ్ పిలుపునిచ్చింది. ఈ మేరకు ఆదివారం వాలంటైన్స్ డేను నిరసిస్తూ బజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో కోఠి ఆంధ్రాబ్యాంక్ చౌరస్తాలో వాలంటైన్స్ డే గ్రీటింగులను బజరంగ్‌దళ్ నాయకులు దహనం చేశారు. అనంతరం బజరంగ్‌దళ్ నగర కన్వీనర్ మహేష్‌యాదవ్ మాట్లాడుతూ.. ప్రాశ్చాత్య సంస్కృతి అయిన వాలంటైన్స్ డే విష సంస్కృతిని కొందరు వ్యాపారులు తమ లబ్ధికోసం విదేశీ సంస్కృతిని భారతీయులపై రుద్దుతున్నారన్నారు. దేశం కోసం ప్రాణాలు అర్పించిన అమర సైనికులను గుర్తుచేసుకుంటూ ఫిబ్రవరి 14న అమర జవాన్ దీవాస్ జరుపుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బజరంగ్‌దళ్ నాయకులు శివకుమార్, పవన్, అభిషేక్, సాయికుమార్, అజయ్, సురేందర్, మధు, భరత్‌వంశీ పాల్గొన్నారు.